క్లుప్తంగా

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

నిడదవోలు: దివిస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఓ. జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్ సమీపంలోని బల్క్ డ్రగ్ పరిశ్రమ, ప్రొడక్షన్ విభాగంలో ట్రైనీ సూపర్‌వైజర్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌గా పని చేసేందుకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీ ఫార్మసీ, బీటెక్ (కెమికల్), ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ /ఎనలైటికల్ కెమిస్ట్రీ), ఎం.ఫార్మసీ అర్హతలు గల 21 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు శారీరక ధారుఢ్యంతో పాటు మంచి ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. వారికి నెలకు రూ.18,000 నుంచి రూ.24,000 వరకూ జీతంగా చెల్లిస్తారన్నారు. జీతంతో పాటు బ్యాచిలర్స్‌కు ఉచితవసతి, ఉచిత యూనిఫాం, భోజన ఖర్చులో రాయితీ ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 6వ తేదీ ఉదయం 9 గంటలకు తమ ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరవ్వాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కో–ఆర్డినేటర్ ఆ.సౌజన్య 7386630918 సెల్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెరవలి: విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కోసం కానూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. ఈ సబ్ స్టేషన్ పరిధిలోని కానూరు, నడుపల్లి, ఉసులుమర్రు, తీపర్రు, కానూరు అగ్రహారం, కాకరపర్రు గ్రామాలకు సరఫరా ఉండదని తెలిపారు.

తల్లి పాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



నల్లజర్లలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ర్యాలీ చేస్తున్న తల్లులు

నల్లజర్ల: తల్లి పాలతోనే బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ నల్లజర్ల సెక్టార్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి తల్లులకు సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం నల్లజర్ల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని తల్లులు, గర్భిణులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ చంటి బిడ్డలకు తల్లిపాలు పట్టిస్తే విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా లభిస్తాయన్నారు. తల్లిపాలు తాగిన పిల్లలకు భవిష్యత్తులో మధుమేహం, ఊబకాయం రావన్నారు. తల్లిపాలలో ఉండే పోషకాలు మరి ఏ ఇతర ఆహార పదార్థాల్లోనూ ఉండవన్నారు. ఇవి బిడ్డ ఎదుగుదలకు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు, ఏఎన్ఎం టి.రత్నకుమారి, కార్యకర్తలు శాంతవల్లి, దేవి, ప్రేమావతి, పద్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

13 వాహనాలకు జరిమానా



గోపాలపురంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

గోపాలపురం: వాహనాల తనిఖీ నిర్వహించి, ఎలాంటి పత్రాలూ లేని వాహనదారులకు అపరాధ రుసుం విధించినట్టు స్థానిక ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు. సోమవారం గోపాలపురంలో నిర్వహించిన తనిఖీల్లో 13 వాహనాలకు ఎలాంటి పత్రాలు లేనట్టు తేలిందన్నారు. కాగా బాలబాలికలకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారంటూ వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్సై కె.శోభనాద్రి, హెచ్‌సీలు సత్యానందం, గోపి పాల్గొన్నారు.

మట్టి తరలిస్తే కఠిన చర్యలు

పెదపూడి: గ్రామాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ మట్టిని అక్రమంగా తరలించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.త్రివేణి హెచ్చరించారు. శహపురం గ్రామంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న ప్రాంతాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్కడి నుంచి మట్టి తరలిస్తున్న వారి వివరాలను స్థానిక వీఆర్వోలు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రాత్రి వేళల్లో మట్టిని తరలిస్తున్న లారీల వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుందని స్థానికులు అధికారులకు విన్నవించారు.

గాడాల పీఠంలో 8 నుంచి మహోత్సవాలు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామివారి పీఠంలో ఈ నెల 8 నుంచి 29వ తేదీ వరకూ వరలక్ష్మి అమ్మవారి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు తెలిపారు. దీనిలో భాగంగా 8 నుంచి 22వ తేదీ వరకూ వరలక్ష్మి హోమం, 29న అష్టలక్ష్మి ధన్వంతరి హోమం నిర్వహిస్తామన్నారు.

తేలిన లెక్క... నష్టం పక్కా

- భారీ వర్షాలు, వరదలతో 5,354 హెక్టార్లలో పంట నష్టం
- డివిజన్‌లో పంట నష్టం విలువ రూ.10 కోట్లు
- 8వ తేదీ వరకూ సామాజిక ఆడిట్
- రైతుభరోసా కేంద్రాలు, సొసైటీల్లో రైతుల జాబితాలు
- 12న తుది జాబితా ప్రకటన



ఎర్ర కాలువ ఉధృతికి నిడదవోలు మండలం కంసాలిపాలెంలో దెబ్బతిన్న వరి పంట (ఫైల్)



కొవ్వాడ కాలువ ఉధృతికి తాళ్లపూడి మండలం రాగోలపల్లి వద్ద నీట మునిగిన వరి (ఫైల్)

కొవ్వూరు: భారీ వర్షాలు, గోదావరి వరదలతో అన్నదాతలకు అపార నష్టం సంభవించింది. పది రోజులకు పైగా పంటలు ముంపులోనే ఉండడంతో వరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. పంట పూర్తిగా కుళ్లిపోవడంతో మళ్లీ నాట్లు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎర్ర కాలువ ప్రభావంతో నిడదవోలు, నల్లజర్ల మండలాల్లో భారీ నష్టం సంభవించింది. నాట్లు వేసిన నలభై రోజులు పైబడిన వరి చేలు సైతం ముంపు బారిన పడడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడ్డారు. నాట్లు వేసిన 20 రోజుల లోపు పంట కోల్పోయిన రైతుల్లో కొందరు మళ్లీ నాట్లు వేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. నారుమళ్లు సైతం ముంపు బారిన పడడంతో నారు దొరకని పరిస్థితి ఏర్పడింది. నారు దొరికిన రైతులు మాత్రం నాట్లకు సిద్ధం అవుతున్నారు. ఎకరానికి సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కొవ్వాడ, ఎర్ర కాలువ, పేముల కాలువ, ఇతర కొండవాగులు పొంగి ప్రవహించాయి. దీనికితోడు గోదావరి వరద ముంచెత్తడంతో పంట ముంపు బారిన పడింది. కొవ్వూరు డివిజన్ పరిధిలో పంట నష్టం అంచనాలు ఓ కొలిక్కి వచ్చాయి.

రైతుల జాబితాపై 8 వరకూ సామాజిక ఆడిట్

కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో పంటనష్టం అంచనాలు పూర్తయ్యాయి. 33 శాతానికి మించి పంట పాడైతేనే పంట నష్టం వాటిల్లినట్టుగా పరిగణిస్తారు. సామాజిక ఆడిట్‌లో భాగంగా పంట నష్టపోయిన రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాలు, సొసైటీలు, ఇతర రైతు సేవా కేంద్రాల్లో ఉంచారు. ఈనెల 8వ తేదీ లోగా రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారు. 12వ తేదీ నాటికి తుది జాబితా సిద్ధం చేస్తారు.

మండలాలవారీగా దెబ్బతిన్న వ్యవసాయ పంటల వివరాలు

మండలం	హెక్టార్లు	రైతుల సంఖ్య	పంట నష్టం(రూ.)
కొవ్వూరు	460	345	58,65,000
చాగల్లు	447	242.311	41,19,372
దేవరపల్లి	565	375.072	63,76,221
గోపాలపురం	401	373.341	63,75,682
తాళ్లపూడి	537	347.69	58,65,000
నిడదవోలు	3,411	2,340	4,02,16,200
ఉండ్రాజవరం	860	562.87	94,09,058
పెరవలి	223	126	21,42,000
నల్లజర్ల	225	178.31	30,31,270
మొత్తం	7,229	4903.599	8,74,69,231

డివిజన్‌లో దెబ్బతిన్న ఉద్యాన పంటల వివరాలు

మండలం పేరు	దెబ్బతిన్న పంట (హెక్టార్లలో)	రైతుల సంఖ్య
పెరవలి	100	160
చాగల్లు	30	39
కొవ్వూరు	67	127
నిడదవోలు	193	267
దేవరపల్లి	9.20	21
గోపాలపురం	4.20	05
తాళ్లపూడి	31.40	54
నల్లజర్ల	6.68	17
ఉండ్రాజవరం	10	14
మొత్తం	451.48	704

పంట నష్టం వివరాలివీ..

వ్యవసాయ, ఉద్యాన పంటలకు కొవ్వూరు డివిజన్‌లో 5,354 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్టు అధికారులు నిర్ధారించారు. ఇందులో వ్యవసాయ పంటలు 4,903.99 హెక్టార్లు, ఉద్యాన పంటలు 451.48 హెక్టార్లు ఉన్నట్టు గుర్తించారు. అత్యధికంగా 4,889 హెక్టార్లలోని వరి పంట దెబ్బతిన్నట్టు లెక్క తేల్చారు. చెరకు 11.6 హెక్టార్లు, మొక్కజొన్న రెండు హెక్టార్లు, ఇసుక మేటలు 37 హెక్టార్లలోనూ వేశాయి. ఉద్యాన పంటల్లో ప్రధానంగా అరటి, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలు హెక్టార్‌కు వరికి రూ.17 వేలు, అరటికి రూ.25 వేలు, కూరగాయలకు రూ.17 వేలు, మొక్కజొన్నకు రూ.12,500, చెరకుకు రూ.17 వేల చొప్పున పరిహారంగా చెల్లిస్తారు. పంట పొలాల్లో ఇసుక మేటలు వేస్తే తొలగింపు కోసం హెక్టార్‌కు రూ.18 వేల చొప్పున పరిహారంగా చెల్లిస్తారు. ప్రధానంగా నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా వరి రైతులు నష్టపోయారు. దీనిలో ఎక్కువ విస్తీర్ణం ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ పరీవాహకం పరిధిలోనివి. ఎర్ర కాలువ ప్రభావంతో అత్యధికంగా నిడదవోలు మండలంలో 3,411 మంది రైతులకు చెందిన 2,360 హెక్టార్ల పంటకు నష్టం వాటిల్లింది. కొవ్వాడ కాలువ ప్రభావంతో గోపాలపురం మండలంలో 374.941 హెక్టార్లు, తాళ్లపూడి మండలంలోని 345 హెక్టార్లలోని పంటకు నష్టం వాటిల్లింది. భారీ వర్షాల వల్ల మండలాల వారీగా కొవ్వూరులో 345, చాగల్లులో 242.31, దేవరపల్లిలో 375.072, ఉండ్రాజవరంలో 550.27, పెరవలిలో 126, నల్లజర్లలో 178.31 హెక్టార్లలోని పంటలకు నష్టం వాటిల్లినట్టు తేల్చారు. సామాజిక ఆడిట్ పూర్తయిన తర్వాత ఫైనల్ జాబితాలను సిద్ధం చేస్తారు. డివిజన్ వ్యాప్తంగా సుమారు రూ.10 కోట్ల విలువైన పంటను రైతులు నష్టపోయారు. రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరించాక తుది జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తారు.

ఇరిగేషన్ శాఖ నోటీసుపై వీహెచ్‌పీ అభ్యంతరం



ఉసులుమర్రులో కాకరపర్రు కెనాల్ గట్టుపై నిర్మించిన రేకుల షెడ్డు

పెరవలి: గోశాల షెడ్డు తొలగించాలంటూ ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసు ఇవ్వడంపై విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) నేతలు అభ్యంతరం తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉసులుమర్రు గ్రామంలోని కాకరపర్రు కెనాల్ కుడిగట్టుపై ఉసులుమర్రు గ్రామానికి చెందిన రామడుగుల సూర్యనారాయణ అనే దాత వీహెచ్‌పీ విజ్ఞప్తి మేరకు రెండేళ్ల క్రితం గోశాల షెడ్డు నిర్మించి ఇచ్చారు. ఈ షెడ్డు పక్కనే 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నవగ్రహాల ఆలయాలు ఉన్నాయి. ఆ షెడ్డును వీహెచ్‌పీ గోశాల గాను, యాగాల నిర్వహణకు వినియోగించుకుంటోంది. కాగా ప్రభుత్వ భూమిలో నిర్మించిన షెడ్డును వెంటనే తొలగించాలంటూ ఈ నెల 1న ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసు జారీ చేశారు. దీనిపై సోమవారం ఉసులుమర్రులో వీహెచ్‌పీ నేతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ అభ్యంతరాలు వెల్లడించారు. రాష్ట్ర గోసేవ ప్రముఖ్ ఓలేటి నారాయణరావు మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మేరకే దాత రెండేళ్ల క్రితం షెడ్డు నిర్మించి ఇచ్చారన్నారు. నోటీసులో పేర్కొన్నట్టుగా కాలువ ప్రవాహానికి ఆటంకం కలగకుండానే షెడ్డు నిర్మించారన్నారు. అధికారులకు ఇబ్బంది కలిగితే షెడ్డును తొలగించవచ్చని లిఖిత పూర్వకంగా తెలుపుతున్నామన్నారు. షెడ్డు దాత రామడుగుల సూర్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడి ఆలయాలకు వచ్చే కరెంటు బిల్లులను కూడా తానే చెల్లిస్తున్నానన్నారు. వీహెచ్‌పీ ప్రతినిధులు కోరిన మేరకే రూ.3 లక్షల వ్యయంతో షెడ్డును నిర్మించి ఇచ్చానన్నారు. షెడ్డు వీహెచ్‌పీదైతే, తనకు నోటీసులు జారీ చేయడం ఏమిటని రామడుగుల ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి తుట్టగుంట అచ్యుత రామయ్య, కొత్తూరి వీర్రాజు, పురాణపండ రాజేశ్వరరావు, తోట సత్యనారాయణ, ఆకుల అన్నవరం, వీరమళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ మోటార్ కేబుల్ వైరు చోరీ



దేవరపల్లి-యాదవోలు రోడ్డులో పంచాయతీ మోటార్ కేబుల్ వైరు కట్ చేసిన దుండగులు



మోటార్ స్టార్టర్ బాక్సును ధ్వంసం చేసిన దుండగులు

దేవరపల్లి: పొలాల్లోని మోటార్ల కేబుల్ వైర్ల చోరీలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. రాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు మోటార్ల వద్ద గల కేబుల్ వైర్లు, స్టార్టర్ బాక్సుల చోరీకి పాల్పడుతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవరపల్లి–యాదవోలు రోడ్డులోని గ్రామ పంచాయతీ మంచి నీటి మోటార్ వద్ద గల స్టార్టర్ బాక్సును ధ్వంసం చేసి, మోటార్ కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. ఈ విషయాన్ని దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి సోమవారం తెలిపారు. దీనివల్ల దేవరపల్లి గ్రామంలో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. అలాగే పరిసర ప్రాంతాల పొలాల్లోని పలు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీ అయినట్టు ఆమె తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న కేవీకే ప్రధానాధికారి నాయుడు

రాజానగరం: ఏపీ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ (ఏపీసీఎన్ఎఫ్) సహకారంతో గోకవరం మండలం వీరలంకపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలచవర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా వరి, మొక్కజొన్న, కూరగాయల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి, అధిక దిగుబడులను అందుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యవంతమైన పంటలను పండించాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమన్నారు. ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.తాతారావు ప్రకృతి వ్యవసాయ విధానాలలో ఉపయోగించే సేంద్రియ రసాయనాలైన బీజామృతం, జీవామృతం, ఘనజీవామృతం, దశపత్ర కషాయం, నీమాస్త్రం మున్నగు కషాయాల తయారీని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పింఛన్లు, ఉపకార వేతనాల పంపిణీ



విద్యార్థులకు ఉపకార వేతనం అందజేస్తున్న క్లబ్ సభ్యులు

సీటీఆర్ఐ: ప్రతి నెలా క్రమం తప్పకుండా వృద్ధులకు పింఛన్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేయడం చాలా ఆనందంగా ఉందని వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అన్నారు. ఆయన అధ్యక్షతన సోమవారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల ఆనందా గార్డెన్స్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పాలసానపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడం హర్షణీయమన్నారు. తన వాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా తాడేపల్లిగూడెంలోని ఎన్ఐటీ చదువుతున్న ఎల్.చేతన, వారణాసిలో ఐఐటీ చదువుతున్న ఎస్.జాషువా అనే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.12 వేల చొప్పున రూ.24 వేలు, క్లబ్ తరఫున ఒక విద్యార్థినికి రూ.6 వేలు అందించారు. వృద్ధులకు ఒక్కొక్కరికి రూ.500 చొప్పున రూ.40 వేలను వృద్ధాప్య పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, నట్టి సూరి అప్పారావు, కుంచె వేణుమాధవ్, అనసూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

నాచుపట్టిన వాటర్ ట్యాంక్



దేవరపల్లిలో వృథాగా పోతున్న తాగునీరు

దేవరపల్లి: ఒక పక్క తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతుంటే, మరో పక్క రోజంతా మంచినీరు వృథాగా పోతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛమైన మంచినీరు లభించక దేవరపల్లి ప్రజలు నానా అవస్థలూ పడుతున్నారు. గ్రామ ప్రజలకు తొమ్మిది మోటార్ల ద్వారా గ్రామ పంచాయతీ మంచి నీటిని సరఫరా చేస్తోంది. దీనిలో రెండు బోర్ల ద్వారా వచ్చే నీరు మాత్రమే తాగడానికి పని చేస్తోంది. మిగిలిన ఏడు బోర్ల ద్వారా సరఫరా అవుతున్న నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో, ఆ నీటిని తాగిన ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. యాదవోలు రోడ్డు, బుచ్చియపాలెం రోడ్డులో మోటార్ల ద్వారా సరఫరా చేస్తున్న మంచి నీటిని ప్రజలు ఎక్కువగా తాగుతున్నారు. యాదవోలు రోడ్డులోని బోరు వద్ద గల ట్యాంకు వద్దకు వెళ్లి ప్రజలు టిన్నులతో మంచి నీటిని తెచ్చుకుని వాడుకుంటున్నారు. అక్కడకు వెళ్లలేని వారు సుద్ద నీటిని తాగి కీళ్లనొప్పులు, పలు అనారోగ్యాలకు గురవుతున్నారు. బుచ్చియపాలెం రోడ్డులోని బోరు వద్ద గల ట్యాంకు నుంచి మంచి నీరు నిత్యం వృథాగా పోతోంది. ట్యాంకు కూడా నాచుపట్టి ఉంది. అధికారులు ట్యాంకును పరిశీలించి తాగునీరు వృథబూగా పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారిని వివరణ కోరగా ట్యాంకును శుభ్రం చేయించి, నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు.

15 నుంచి అన్న క్యాంటీన్ ప్రారంభం



కొవ్వూరులో అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు: ఈనెల 15వ తేదీ నుంచి పట్టణంలోని బస్టాండ్ సెంటర్లో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించనున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెలిపారు. నూతన క్యాంటీన్ కోసం సిద్ధం చేస్తున్న భవనాన్ని సోమవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంతమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, జనసేన పార్టీ అధ్యక్షుడు డేగల రాము తదితరులు పాల్గొన్నారు.

నాని టీమ్ ప్రత్యేక పూజలు



దేవితల్లిని దర్శించుకున్న చిత్ర బృందం

రాజానగరం: వర్ధమాన హీరో, దర్శకుడు, నిర్మాత పవన్‌కుమార్.కె స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'యావరేజ్ స్టూడెంట్ నాని' చిత్ర బృందం రాజానగరంలోని జగన్మాత దేవితల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేసింది.

నిత్యావసరాల అందజేత

పెదపూడి: రంగంపేట మండలం జి.దొంతమూరు గ్రామానికి చెందిన వీరవెంకట సత్యనారాయణ, నాగదేవి దంపతులు తమ కుమారుడు తోరాటి రీయాన్ష్ పుట్టినరోజు సందర్భంగా అనపర్తి తేతలి రామిరెడ్డి, మంగయమ్మ మహిళా వృద్ధాశ్రమంలో 25 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు సోమవారం అందజేశారు. అలాగే భవిత సెంటర్లో ఉన్న దివ్యాంగ పిల్లలకు పాలు, పెరుగు, బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైజింగ్ హ్యాండ్స్ ఫర్ హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, నల్లమిల్లి ఆదిరెడ్డి, నల్లమిల్లి వినురెడ్డి, చేవలి శ్రీనివాస్, కిరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బుర్రిలంకలో రక్తదాన శిబిరం

కడియం: దివంగత మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు జయంతిని పురస్కరించుకుని కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. బుర్రిలంక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం

కడియం: కడియపు సావరం వైఎస్సార్ కాలనీలో పాస్టర్ డి.షాలేమురాజు యెరూషలేము ప్రార్థనా మందిరంలో సోమవారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం జరిగింది. ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎం కరుణాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డి పరంజ్యోతి, గౌరవ అధ్యక్షుడు కె.జయశీల్, వైస్ ప్రెసిడెంట్ ప్రసన్న కుమార్ తదితరులు వాక్య సందేశాన్నందించారు. ఈ కార్యక్రమానికి ఫెలోషిప్ సెక్రటరీ సీహెచ్ రత్నదీప్ అధ్యక్షత వహించారు. సంఘస్తుడైన కొండయ్య కుటుంబం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఫెలోషిప్ సేవకులందరూ కలిసి రూ.3 వేలు, బియ్యం, దుస్తులు అందజేశారు.

దేవగళ్ల వెంకట రమణ మృతి

కడియం: దేవతిలకుల జాగృతి పత్రిక గౌరవ సంపాదకుడు దేవగళ్ల వెంకటరమణ (73) మంగళవారం కన్నుమూశారు. దుళ్ల గ్రామానికి చెందిన ఆయన కూల్‌డ్రింక్స్ అండ్ పాన్‌షాప్ వర్తక సంఘం అధ్యక్షుడిగా గతంలో సేవలు అందించారు. ఆయన మృతదేహానికి పలువురు ప్రముఖులు, ప్రజలు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వెంకటరమణకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యావసరాల అందజేత



గొల్లగూడెంలోని వృద్ధాశ్రమానికి బియ్యం, నిత్యావసరాలు అందజేస్తున్న దాతలు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం వద్ద గల లగడపాటి రామలక్ష్మమ్మ దివ్యాంగుల, వృద్ధాశ్రమానికి దాతలు బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. కల్యాణదుర్గం ఎమ్మెల్యే, ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ అధినేత అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలను సోమవారం ఆశ్రమం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి 10 బస్తాల బియ్యం, నిత్యావసర సరకులను ఆ సంస్థ సిబ్బంది ఎం.భరత్, ఎం.సత్యనారాయణ, రంజిత్, అనీష్ అందజేశారు. దాతలకు ఆశ్రమం వ్యవస్థాపక చైర్మన్ కాగిత భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందజేత



పెద్దాపురం పాఠశాల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్న దాత దుర్గాభవాని

గోపాలపురం: విద్యార్థులు ఆరోగ్యం ఉండాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమని మండల విద్యాశాఖాధికారి జి. శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెద్దాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో సోమవారం దాత అలపాటి దుర్గాభవాని ఆర్థిక సహాయంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ పాఠశాలలకు దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే పౌష్టికాహారంతో పాటు దాతలు సహకారం మరువ లేనిదన్నారు. గ్రామపెద్దలు గన్నిన రామారాయుడు, ఉపాధ్యాయులు ఎ. రాజశేఖర్, జగతా శ్రీనివాస్, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.